బాల్ బ్యాడ్మింటన్‌కు కృష్ణవేణి విద్యార్థులు



వినుకొండ(నూజెండ్ల): గుంటూరు జిల్లా అసోసియేషన్ బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్ ఆధ్వర్యంలో జిల్లా సెలక్షన్‌లో కృష్ణవేణి జూనియర్ కాలేజీ విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థి పి.లక్ష్మీభవానిని కళాశాల ఆవరణలో ఘనంగా అభినందించారు. ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు నంద్యాల జిల్లా మహానంది లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో లక్ష్మీభవాని పాల్గొంటుందని తెలిపారు. కళాశాల డైరెక్టర్ బి.లింగారావు,బి.మల్లికార్జునరావు, ఎ.సాయికుమార్, ప్రిన్సిపాల్ ఎం.వి.ఆంజనేయులు, ఆర్.సీమెచ్. వెంకట్రావు, కళాశాల సిబ్బంది, కోచ్ జోనానాయక్ అభినందించారు.

ముమ్మరంగా జలజీవన్ మిషన్ పనులు

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులు రూ. 50 లక్షల వ్యయంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ 40 వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ఓవర్‌హెడ్ ట్యాంకు, 20 లీటర్ల కల్గిన సంప్ పనులు తుది దశకు చేరినట్లు చెప్పారు. అలాగే బీసీ, ఎస్సీ కాలనీలో మొదట విడతలో రెండు కిలో మీటర్ల మేర ఇంటింటికీ నీటి కుళాయిలు 180 నివాస గృహాలకు అమర్చే పనులు పూర్తి అయినట్లు చెప్పారు. ముండ్రువారిపాలెం మంచినీటి చెరువు ద్వారా సాగర్‌జలాలను నింపుతామన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు గ్రామసర్పంచ్ పురేటి నాగేశ్వరరావు పర్యవేక్షణలో పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. నెలరోజుల వ్యవధిలో పనులు పూర్తి చేసి ఇంటింటి కుళాయి దారులకు తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

చిలకలూరిపేటలో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

శాసనమండలిలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ విజ్ఞప్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): నానాటికీ చిలకలూరిపేటలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా ట్రాఫిక్స్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ శాసనమండలి దృష్టికి తీసుకెళ్లారు. కోల్‌కొత్తా, చెన్నై రహదారిపై చిలకలూరిపేట వద్ద నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి ప్రస్తావించారు. నిత్యం పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగులు, వివిధ పనులకు నిమిత్తం వెళ్లేవారు జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల అడ్డరోడ్డు సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రగాయాలపాలైన విషయాన్ని తెలియజేశారు. లక్షన్నరకు పైగా ఉన్న చిలకలూరిపేట జనాభా నిత్యం పనుల నిమిత్తం జాతీయ రహదారిపై రావడం వల్ల తీవ్రంగా ట్రాఫిక్ పెరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు పట్టణంలో మూడు ప్రాంతాల్లో ట్రాఫిక్స్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు.

ఇదే విషయాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఇప్పటికైనా చిలకలూరిపేట పట్టణంలో ట్రాఫిక్స్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, పట్టణ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని శాసన మండలిలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



ఇంటింటి సర్వేలో భాగంగా పరీక్ష చేస్తున్న ఆరోగ్య కార్యకర్త రాజ్యలక్ష్మి

శావల్యాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ తెలిపారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిలోని వారిని వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించి 10 నుంచి 17 సంవత్సరాల లోపు వారందరి హిమోగ్లోబిన్ శాతం, 18 సంవత్సరాల దాటిన వారందరికీ బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామంలో ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరుగుతుందన్నారు. అందులో భాగంగా ఆరోగ్య కార్యకర్త దాసరి రాజ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి, పృధ్వీరాణి, ఆశలు రెండు టీమ్స్‌లు ఏర్పడి వైద్యపరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆరోగ్య సిబ్బంది బుధవారం విస్తృతంగా అన్ని గ్రామాల్లో నిర్వహించారు. గణపవరం, నాదెండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 15న ప్రారంభమైన సర్వే బుధవారం కొనసాగింది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటికి తిరిగి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 30 నుంచి ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్నిఏర్పాట్లను వైద్యాధికారులు, మండల స్థాయి అధికారులు చేస్తున్నారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం అమీన్‌సాహెబ్‌పాలెంలో జరిగిన కార్యక్రమాన్ని వైద్యాధికారి ప్రసాద్‌నాయక్‌లు పర్యవేక్షించారు.

భవ్యశ్రీ హంతకులను కఠినంగా శిక్షించాలి

చిలకలూరిపేట: భవ్యశ్రీ హంతకులను కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ నాయకులు కోరారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో బీసీ జేఏసీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం కావూరివారిపల్లె గ్రామానికి చెందిన 16 ఏళ్ల భవ్యశ్రీని నలుగురు యువకులు ఈ నెల 17న లైంగిక దాడి చేయడంతో పాటు శిరోముండనం చేసి ఆపై ఉరివేసి చంపి, బావిలో పడవేయడం అత్యంత దారుణమైన దురాగతమని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవ్యశ్రీ హంతకులకు కఠిన శిక్ష విధించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ముందుగా భవ్యశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గుంజి వీరాంజనేయులు, బీసీ జేఏసీ నాయకులు నాయుడు వాసు, మద్దుల వెంకట కోటయ్య, ఉప్పాల భాస్కరరావు, కాకుమాను రమేష్, తన్నీరు వీరాంజనేయులు, ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు బి శ్రీనునాయక్ పాల్గొన్నారు.

ఉప్పలపాడులో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): స్వచ్ఛభారత్ మండల రీసోర్స్ సమన్వయకర్త కంచర్ల సుబ్బరామయ్య ఆధ్వర్యంలో నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంపై ర్యాలీ, మానవహారం నిర్వహించి విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.రమణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరమ్మ, యోగా టీచర్ వెంకటాచారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు



మాజీ ఎమ్మెల్యే మక్కెన, బొల్లా గిరిబాబులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బజారులో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ యువనాయకులు బొల్లా గిరిబాబు ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బొల్లా గిరిబాబును, మక్కెనను ఘనంగా సత్కరించారు.

పమిడిపాడులో...

నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా యువనాయకులు బొల్లా గిరిబాబు పూజలు చేసి ఊరేగింపులో పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వినాయకుని నిమజ్జనాలు

నాదెండ్ల: వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం చివరి రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. గత తొమ్మిది రోజులుగా గణనాథుడు విశేషంగా పూజలందుకున్నాడు. గణపవరం, గొరిజవోలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలకు భారీగా ఊరేగింపు నిర్వహించారు. గొరిజవోలు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద వినాయకుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం తూర్పువాగులో నిమజ్జనం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వనమాల కోటిరెడ్డి, కందుల శ్రీకాంత్‌రెడ్డి, బోయినపల్లి చిన్న, కందుల రాజశేఖరరెడ్డి, బెల్లంకొండ శ్రీను, దివ్వె పిచ్చయ్య, బి.రవి, బహునాథం శ్రీనివాసరావు ఉన్నారు. గణపవరం శాంతినగర్‌లో ట్రెండ్ సెట్టర్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహానికి పూజల అనంతరం డీజేలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం యడ్లపాడు వాగులో నిమజ్జనం చేశారు. యువత బాణాసంచా కాలుస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మాస్టర్ పురాణం శ్రీదేవి ఆధ్వర్యంలో చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

కుస్తీ పోటీలకు ఎస్‌కేఆర్‌బీఆర్ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.వి.నాగిరెడ్డి బుధవారం తెలిపారు. ఈనెల 21 నుంచి 23వతేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా నున్నలో నిర్వహించిన అంతర్‌జిల్లాల రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలలో తమ విద్యార్థులు అండర్-17 48 కేజీల విభాగంలో ఒ.నాగబ్రహ్మయ్య, 61 కేజీల విభాగంలో ఎం.నాగరత్నకుమారి ప్రథమస్థానాలు సాధించి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. మధ్యప్రదేశ్‌లో అక్టోబర్ 3వ తేదీ నుంచి జరగనున్న జాతీయస్థాయి కుస్తీ పోటీలలో తమ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటశివ, పీడీ ఎం.వినీల్ అభినందించారు.

సమసమాజ నిర్మాణమే జాషువా ఆశయం



మాట్లాడుతున్న డాక్టర్ స్వర్ణలతాదేవి

నరసరావుపేట ఈస్ట్: సామాజిక అసమానతలను తన సాహిత్యంతో ఖండించి సమ సమాజ స్థాపనే లక్ష్యంగా జాషువా సాహితీ ప్రక్రియ కొనసాగిందని దళిత రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఎం.స్వర్ణలతాదేవి తెలిపారు. పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సాయంత్రం విశ్వకవి గుర్రం జాషువా 128వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.హనుమంతయ్య అధ్యక్షతన జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ స్వర్ణలతాదేవి మాట్లాడుతూ, సామాజిక వాస్తవికతలో జీవించి, సాహిత్యంలో ప్రజాస్వామ్యాన్ని స్వాగతించి తద్వారా సమ సమాజాన్ని జాషువా కోరుకున్నారని వివరించారు. కొందరికే పరిమితమైన పద్య ప్రపంచాన్ని సామాజిక అంశాలతో సామాన్యులకు పరిచయం చేసి విశ్వకవిగా గుర్తింపు పొందారని వివరించారు.

పత్రికా ప్రకటన

నా క్లయింటు అయిన వినుకొండ పట్టణ నివాసి యేరువాకి చెన్నయ్యగారి కుమారుడు సత్యనారాయణ గారు ఇచ్చిన సమాచారము మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింటుకు తన ప్రిన్సిపల్ అయిన వినుకొండ వాస్తవ్యులు ఎ.పి.యల్.నరసింహారావుగారి కుమారుడు జీవన్‌రామ్ అనువారు తనకు గల వినుకొండ పట్టణము కారంపూడి రోడ్డులోగల శ్రీ తిరుమలనగర్‌లోని ఈ దిగువ [illegible]

చంద్ర ఆంజనేయులు, అడ్వకేట్, నరసరావుపేట. సెల్. 94411 42298

విద్యార్థి కృష్ణకు కన్నీటి వీడ్కోలు

నివాళులర్పించిన నేతలు, కుటుంబ సభ్యులు



కృష్ణ భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌తో ఐదుగురు వ్యక్తులకు అవయవదానం చేసిన విద్యార్థి కట్టా కృష్ణ భౌతికకాయం మంగళవారం రాత్రి శాంతినగర్‌లోని మృతుడి నివాసానికి చేరుకుంది. బుధవారం కట్టా కృష్ణ భౌతిక కాయన్ని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, మాజీ సొసైటీ చైర్మన్ తోట బ్రహ్మస్వాములు తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చి నివాళులు అర్పించారు. విద్యార్థి స్నేహితులు, బంధువులు శోకసంద్రంలో మునిగి పోయారు. అవయవదానంతో పలువురికి కొత్త జీవితం ప్రసాదించిన కృష్ణ, కుటుంబ సభ్యుల త్యాగనిరతిని కొనియాడారు. అశ్రునయనాలతో కట్టా కృష్ణ అంతక్రియలు బుధవారం పూర్తి చేశారు.

రైతులకు భూహక్కు పత్రాలు మంజూరు

శావల్యాపురం: రీసర్వే పనులు పూర్తి అయిన రెవెన్యూ గ్రామాల్లోని రైతులకు భూహక్కు పత్రాలు మంజూరైనట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు తెలిపారు. వేల్పూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 2539 మంది రైతులకు భూహక్కు పత్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అలాగే మండలంలోని పిచికలపాలెం-1214, పోట్లూరు-2242 మంది రైతులకు భూహక్కు పత్రాలు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే మండలంలోని కనమర్లపూడి రెవెన్యూ గ్రామపరిధిలో 1434 మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారన్నారు. త్వరలో మంజూరైన రెవెన్యూ గ్రామాల్లోని రైతులకు భూహక్కు పత్రాలను అందజేస్తామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఉన్నారు.

కుంగ్‌ఫూ పోటీలలో పేట విద్యార్థుల ప్రతిభ



చిలకలూరిపేటటౌన్: సెప్టెంబర్ 21వ తేదీ తెలంగాణా రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీలలో తమ అకాడమీ విద్యార్థులు 10 బంగారు పతకాలు సాధించటం అభినందనీయమని న్యూషావలిన్ కుంగ్ ఫూ అకాడమీ మాస్టర్ బత్తుల విక్రమ్ చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం సీఆర్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ అత్యవసరమని చెప్పారు. మానసిక ఉల్లాసానికి, వికాసానికి, శారీరక దృఢత్వానికి మార్షల్ ఆర్ట్స్ దోహదపడతాయన్నారు. మార్షల్ ఆర్ట్స్‌కు వయసుతో సంబంధం లేదని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ కుంగ్ ఫూ మాస్టర్ ఎస్‌కె దరియావలి, యడ్ల సురేష్, పాలపాటి నాగరాజు, కొర్రపాటి రాంబాబు, రబ్బాని, దుర్గా ప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.


ప్రతి ఇంటికీ తాగునీరు అందించటమే లక్ష్యం



గ్రామ సర్పంచ్ అబ్దుల్లా బాషాకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్

చిలకలూరిపేట: ప్రతి ఇంటికీ తాగునీరు అందించటమే లక్ష్యమని జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ పి.కిరణ్‌కుమార్ చెప్పారు. మండలంలోని పోతవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జేజేఎం ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందరికీ పరిశుభ్రమైన నీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా హర్‌ఘర్ జల్ (ప్రతి ఇంటికీ నీరు) కార్యక్రమం చేపట్టాయని చెప్పారు. ఈ కార్యక్రమం కింద పోతవరం గ్రామం ఎంపికైందని వివరించారు. దీని ద్వారా గ్రామంలో 480 గృహాలకు నీటి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అబ్దుల్లాబాషాకు హర్‌ఘర్ జల్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, జేజేఎం డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ తేజ్ సంగీత్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గేదె మృతి



రొంపిచర్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని సంతగుడిపాడు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. సంతగుడిపాడు గ్రామానికి చెందిన మోదుగుల లక్ష్మీనారాయణకు చెందిన గేదె మేత కోసం హైవే రోడ్డు మీదుగా పొలానికి వెళ్తుండగా వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.75 వేల రూపాయలకు పైగా ఉంటుందని బాధితుడు లక్ష్మీనారాయణ వాపోయాడు.

యువతకు స్ఫూర్తిప్రదాత భగత్‌సింగ్



భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలూరిపేట: యువతకు స్ఫూర్తి ప్రదాత సర్దార్ భగత్‌సింగ్ అని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ చెప్పారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతిని బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగత్ సింగ్ విద్యార్థి దశలోనే జలియన్ వాలా బాగ్ దుర్ఘటనతో చలించి పోయారని చెప్పారు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 సంవత్సరాలకే ప్రాణ త్యాగం చేసి ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదాన్ని ఈ ప్రపంచానికి పరిచయం చేశారని తెలిపారు. విప్లవ వీరుడు భగత్ సింగ్ నిరుపమాన పోరాటం, త్యాగాన్ని దేశం ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, బి.లలితకుమారి, బొంతా భగత్‌సింగ్, జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

1108 బత్తాయి పండ్లతో గణపయ్యకు అలంకారం

నరసరావుపేట ఈస్ట్: గణపతి నవరాత్రుల ఉత్సవాల వైభవంగా కొనసాగుతున్నాయి. పాతూరులోని మద్ది రాఘవయ్య బావి వద్ద యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో దశమ వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన పందిరిలోని దశావతార సహిత శ్రీవీరగణపతిని బుధవారం 1108 బత్తాయి పండ్లతో అష్టోత్తర శతనామావళితో పూజించారు. పందిరిలోని గణనాధుడిని గురువారం నిమజ్జనానికి తరలించనున్నట్లు కన్వీనర్ వనమా పవన్‌కుమార్ తెలిపారు.

నేడు జాషువాపై చర్చావేదిక

నరసరావుపేట ఈస్ట్: పల్నాడురోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో ఈనెల 28వ తేదీ గురువారం సాయంత్రం 6గంటలకు శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వ ర్యంలో గుర్రం జాషువా 128వ జయంతిని పురస్కరించుకుని మానవతావాది గుర్రం జాషువా అనే అంశంపై చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్చావేదికలో సాహితీ వేత్తలు, భాషాభిమానులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

శావల్యాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. బుధవారం మండలంలోని కనమర్లపూడి గ్రామసచివాలయ పరిధిలో ఈనెల 30న జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు వైఎస్సార్ క్లీనిక్ కేంద్రంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తన్నీరు భారతి, ఎంపీటీసీ సభ్యురాలు మరియమ్మ, ఎంపీడీవో పేరు మీనా సీతారామయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

నరసరావుపేట టౌన్: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్ర బాబు బుధవారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన షేక్ ఖాజావలి ద్విచక్ర వాహనంపై రెండు రోజుల క్రితం బరంపేట ఆవుల సత్రం వైపు వస్తుండగా వెనుకగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.